# తమసోమా జ్యోతిర్గమయ

"ఎవరూ? గోపాలం, నువ్వటోయ్? అలా చూడకుండానే వెళ్లిపోతున్నావ్?"

తలవంచుకొని అన్యమనస్కంగా నడుస్తున్న గోపాలరావు ఉలిక్కిపడి నడక్కు బ్రేకు పడ్డట్టు ఆగిపోయాడు.

పచ్చగా, పొట్టిగా, లావుగా, గుండ్రంగా ఉన్న ఆ విగ్రహం ఒకదానిమీద ఒకటి మూడు సున్నాలు చుట్టినట్టుంది. షర్టు లేకుండా కప్పుకున్న పచ్చని శాలువాలోంచి తొంగి చూస్తోంది బొజ్జ. మోకాళ్ళవరకు ధోవతి, చేతులకు సింహతలాటాలు, లలాటంమీద కుంకుమబొట్టు. చేతిలో పంచాంగం. ఆయన్ను చూస్తుంటే అంత విసుగులోనూ గోపాలానికి నవ్వాలనిపించింది.

"ఏంవిటోయ్! అలా కొత్తవాణ్ణి చూస్తున్నట్లు చూస్తున్నావ్? నాన్నగారు కులాసాగా ఉన్నారా?"

"ఆఁ... అబ్బే- ఏం లేదండీ! ఏదో పరధ్యానంగా ఉన్నానంతే. నాన్నగారు మిమ్మల్ని అప్పుడప్పుడూ తలుస్తూనే ఉంటారు."

'నాకూ నాన్నగారిని చూడాలని ఉందోయ్! ఈ మధ్య బొత్తిగా తీరిచావడంలేదు.'

'ఎందుకు తీరుతుంది? నాన్నగారు రిటైర్ అయాక ఇంటి పరిస్థితులు మీకు తెలియకపోతేగా?' మనస్సులోనే అనుకున్నాడు గోపాలం.

రామశాస్త్రి మంచి సిద్ధాంతిగా ఆఫీసర్ల ఇళ్ళలో నయితేనేం, మంత్రుల ఇళ్ళలో నయితేనేం, ఏ శుభకార్యం జరిగినా పిలుపు వస్తుంది. జాతకాలు వ్రాయటంలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకున్నాడు. మొత్తంమీద మంచి రాబడితోపాటు పదిమందిలో పలుకుబడి కూడా సంపాదించుకున్నాడు. పిల్లలందర్నీ మంచి చదువులు చదివించి ఉద్యోగాల్లో పెట్టాడు.

"నాన్నగారి ఆరోగ్యం ఎలా ఉంది? నీ చదువు పూర్తయిందా?" తెచ్చి పెట్టుకున్నట్లుంది, ఆ స్వరంలో ఆప్యాయత.

"నాన్నగారికి ఒంట్లో అంత బాగా ఉండటంలేదు. నేను బి.ఏ. పూర్తి చేశాను. ఫస్టుక్లాసులో పాసయాను. ఆరునెలలుగా ఎన్ని ప్రయత్నాలు చేసినా నాకు ఉద్యోగం దొరకలేదు. నాన్నగారికి ఇదో దిగులు!" దిగులుగా అన్నాడు గోపాలం.

"దిగులుపడి చేసేదేముంది? అన్నీ తెలిసిన నాన్నగారు యింత చిన్న విషయాలకు దిగులుపడటం ఏమిటి?" వేదాంతిలా ముఖంపెట్టాడు శాస్త్రి.

గోపాలానికి వళ్ళు మండింది. 'ఈ వూరు వచ్చిన కొత్తలో మీరు గడిపిన జీవితాన్ని ఒకసారి గుర్తు చేసుకోండి' అనాలనిపించింది గోపాలానికి. అప్పుడు తనకు పన్నెండు సంవత్సరాల వయస్సుండవచ్చును. దిగాలుపడి కూర్చున్న శాస్త్రికి నాన్నగారు ధైర్యం చెప్పటం ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లుంది.

"అన్నీ తెలిసినవారికి జీవిత సమస్యలు ఉండవా?"

"ఉంటాయనుకో. దిగులుపడి చేసేది మాత్రం ఏముంది? 'ప్రాప్తవ్య మర్థం లభ్యతే మనుష్యః దేవోఽపితం లంఘయితుం నశక్తిః!' అన్నాడు శాస్త్రి అరమోడ్పు కన్నులతో, కుడిచేతిని గాలిలోకి విసురుతూ.

'నాకు సంస్కృతం బాగా రాదు. అర్థం సెలవిస్తారా?' అన్నాడు వళ్ళు మండిన గోపాలం.

"తప్పక! విను; అంటే మానవుడు తను పొందవలసిన వస్తువును తప్పక పొందును. దానిని భగవంతుడు కూడా ఆపలేడు." శాస్త్రి స్వరంలో తన్మయత్వం నిండివుంది.

'అంటే మనకు ప్రాప్తం ఉన్నది దానంతట అదే ప్రాప్తం అవుతుందంటారు? అలా లేకపోతే భగవంతుడు కూడా ఏమీ చెయ్యలేడంటారు?'

"అవునోయ్ గోపాలం!" శాస్త్రి సగర్వంగా చిరునవ్వుతో అన్నాడు.

'అంటే భగవంతుడు ఒక వ్యక్తిని బాగుచెయ్యలేడన్నమాట! మరి భగవంతుడు చెయ్యగలిగిందేమిటో సెలవిస్తారా?' గోపాలంకూడా చిరునవ్వుతోనే ప్రశ్నించాడు.

శాస్త్రి కొంచెం తికమకపడ్డారు. బొడ్లోనుంచి బంగారం పొదివిన పొడుం కాయతీసి, ఇంత పొడుం అరచేతిలో వేసుకొని గట్టిగా పీల్చాడు.

"ఎక్కడికిదాకా వెళుతున్నావ్?" అన్నాడు శాస్త్రి మాట మారుస్తూ.

"అనాదినుంచి అనంతంలోకి" అన్నాడు గోపాలం శాస్త్రివైపు చూస్తూ.

గోపాలం మాటల్లోని వ్యంగ్యాన్ని గుర్తించని శాస్త్రి ఫక్కున నవ్వాడు. 'భలే మాట్లాడుతావోయ్ గోపాలం! ఇన్ని మాటలు ఎప్పుడు నేర్చావ్?' అరచేతిలో మిగిలిపోయిన ముక్కుపొడుం గట్టిగా ఎక్కించాడు. చేతులూ, ముక్కూ శాలువతో తుడుచుకున్నాడు.

"తమరు ఎక్కడనుంచీ ఎక్కడిదాకా?"

'నేనా? కలెక్టరుగారింటినుంచి వస్తున్నాను. నలుగురు ఆడపిల్లల తరువాత ఓ వంశోద్ధారకుడు జన్మించాడోయ్! ఆ కుర్రాడి జాతకం రాసివస్తున్నాను. బ్రహ్మాండమైన అదృష్టజాతకుడులే. జాతకం అంటే అలా ఉండాలి! తొంభై సంవత్సరాలు జీవిస్తాడు. మహారాజ వైభవం అనుభవిస్తాడు. పద, నడుస్తూ మాట్లాడుకుందాం.'

ఎక్కడికని అడక్కుండానే గోపాలం శాస్త్రిని అనుసరించాడు.

గోపాలానికి ఇవ్వాళ శాస్త్రిని ఒక పట్టాన వదిలిపెట్టాలనిపించటంలేదు. తనకు వేరే పనిలేదు. ఏదో ఉబుసుపోకకోసం అలా నడిచి వెళుతున్నాడు. భవిష్యత్తును గురించిన ఆలోచన ఓ వైపు పురుగులా తొలుస్తూనే ఉంది.

'అయితే శాస్త్రీజీ! కలెక్టరుగారబ్బాయి అదృష్టజాతకుడంటారు? ఒకవేళ మీ జాతకం...?'

'ఆఁ ఆఁ ఎంతమాట! నేను వ్రాసిన జాతకాన్నే సందేహిస్తున్నావా?' తీవ్రంగా ఉంది శాస్త్రి స్వరం.

'ఇప్పుడు మర్చిపోయారేమో! నాన్నగారితోకూడా అలాగే అనేవారు. నాకూ బ్రహ్మాండమైన జాతకం వ్రాశారు. నేను చాలా గొప్ప హోదాలో ఉంటానని వ్రాశారు' అన్నాడు గోపాలం శాస్త్రి మొహంలోకి చూస్తూ.

'ఏం? ఇప్పుడు మాత్రం నీకొచ్చిన కష్టం ఏమిటి? అప్పుడే నీ జీవితంలో ఎంత భాగం అయిందని నా జాతకం తప్పంటావు? అలా చూస్తుండు, అదృష్టదేవత నిన్ను వరిస్తుందో లేదో!' గోపాలాన్ని మందలిస్తూ అన్నాడు శాస్త్రి.

'ఎప్పుడో వరించింది దురదృష్టదేవత'- గొణుక్కున్నాడు గోపాలం తనలో తనే మాట్లాడుకుంటున్నట్లు.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

'కలెక్టరుగారి అబ్బాయి మీరు వ్రాసిన జాతకం ప్రకారం తొంబయ్ ఏళ్ళూ బ్రతికితీరాలంటారు?' మౌనభంగం చేస్తూ ప్రశ్నించాడు గోపాలం.

"అవును." శాంత గంభీర స్వరంతో పలికాడు శాస్త్రి.

"ఒకవేళ పురుడుకూడా వెళ్ళకుండానే చనిపోతే?"

'అలా జరగటానికి వీల్లేదు. ఆ సమయం రాకుండా యెన్ని గండాలు వచ్చినా బ్రతికి తీరాల్సిందే!' ఖచ్చితంగా అన్నాడు శాస్త్రి.

"అయితే గురూజీ! అకాల మృత్యువు అని దేన్నంటారో కొంచెం సెలవిప్పిస్తారా?"

శాస్త్రి కొంచెం ఖంగారుపడ్డాడు. దూరంగా రోడ్డుమీద దేన్నోచూస్తున్నట్లూ, గోపాలం మాటల్ని వినిపించుకోనట్లూ నడుస్తున్నాడు.

"ఆ సమయం వస్తే చావున్నుంచి ఎవరూ తప్పించుకోలేరంటారు- అవునా?" రెట్టించాడు గోపాలం కయ్యానికి కాలు దువ్వుతున్నట్లు.

"అవును. స్పష్టంగా వ్రాసిపెట్టివుంది. 'నా కాలేమ్రియతే కశ్చిత్ ప్రాప్తకాలే న జీవతి."

"అంటే నాకు జ్వరం వచ్చిందనుకోండి. ఆ జ్వరంతోనే నేను చావాలని వ్రాసి పెట్టివుంటే, లక్ష ప్రయత్నాలూ నిరుపయోగం అంటారు?"

"అంతే నాయనా, అంతే! మనచేతుల్లో ఏముంది? మానవమాత్రులం. మన ప్రయత్నాలు ఆ లీలామయుని నిర్ణయం ముందు ఏపాటివి?"

'రెండు సంవత్సరాలక్రితం మీ రెండోవాడికి జబ్బు చేస్తే డాక్టర్ నాయర్ దగ్గిరకు పరుగెత్తారేమండి? డాక్టరు కాళ్ళమీదపడి మీ బిడ్డ ప్రాణాల్ని కాపాడమని ఏడ్చారట! అన్నీ తెలిసిన మీరే మానవమాత్రుణ్ణి బిడ్డ ప్రాణాలు కాపాడమని వేడుకోవటం ఏమిటి?'

శాస్త్రి పని కుడితిలో పడ్డ ఎలుక చందమైంది.

"ఉద్యోగినం పురుషసింహ ముపైతి లక్ష్మి. మన ప్రయత్నం మనం చెయ్యాలి నాయనా!"

గోపాలం ఫక్కున నవ్వాడు. శాస్త్రి నడుస్తూ నడుస్తూ ఠక్కున ఆగిపోయాడు.

"నడవండి శాస్త్రిగారూ! నడుస్తూనే మాట్లాడుకోవచ్చు." చిరునవ్వుతో అన్నాడు గోపాలం.

ఈ కుర్రకుంకలతో వాగ్వివాదం పెట్టుకోవడం అంత బుద్ధితక్కువపని మరొకటి లేదు. ఈ కాలం కుర్రాళ్ళు! రామ రామ! బొత్తిగా పాపభీతి లేకుండా పోతోంది. ఏం

చదువులో ఏమిటో? నానాటికీ నాస్తికుల సంఖ్య పెరిగిపోతోంది.

"ఏమిటండీ గురువుగారూ ఆలోచిస్తున్నారు? అదిగో, ఆ పిల్ల చంకలోవున్న మేకపిల్ల ఎంత అందంగా ఉందో చూడండి!"

'ఆఁ ఆఁ అవునవును!' అనేశాడు శాస్త్రి గోపాలం ధోరణి అర్థంగాక.

"ఆ మేకపిల్లకు మరో ఆరు నెలలకు చావు వ్రాసిపెట్టి ఉందనుకోండి. ఈ మధ్యకాలంలో ఎవరూ దాన్ని చంపలేరంటారు?"

'శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు నాయనా!'

'అలాగే అయితే ఇప్పుడే దాన్ని కొని మీ కళ్ళముందే చంపేస్తాను, దానికేమంటారు?' గోపాలం శాస్త్రి మొహంలోకి దీక్షగా చూశాడు. ఈ దెబ్బతో శాస్త్రికి నాలుక పిడచకట్టుకుపోదే? అనుకున్నాడు.

శాస్త్రి మొహంలో గాంభీర్యంతో మిళితమైన చిరునవ్వు వెలిసింది.

'దానికి ఈనాటితో కాలం తీరిపోతే నీకు అలాంటి బుద్ధి పుట్టిస్తాడు పరమశివుడు' అంటూ ఇంత ముక్కుపొడుం చిటికెలోకి తీసుకొని గట్టిగా ఎక్కించాడు. ముక్కుకొనను అరచేత్తో రుద్దుకొన్నాడు. అది చూసిన గోపాలానికి కడుపులో దేవినట్లయింది.

"తాదృశీ జాయతే బుద్ధిః యాదృశీ భవితవ్యతాః" అన్నాడు శాస్త్రి ముక్కు తుడుచుకున్న చేతిని శాలువాకు తుడుచుకుంటూ.

'ఎలా వ్రాసిపెట్టి ఉంటే అలాగే మన బుద్ధి మనచేత చేయిస్తుందంటారు?'

'కరెక్ట్!' శాస్త్రి ఉత్సాహంగా అన్నాడు.

'అంటే బుద్ధి స్వతంత్రంగా పనిచెయ్యదన్నమాట. మానవుడు చేసే పనులకు అతడు బాధ్యుడు కాదన్నమాట. అంటే మనిషి చేసే పాపపుణ్యాలకు సంజాయిషీ అతను చెప్పుకోనక్కరలేదు. ఇది చెయ్యి! అది చెయ్యకు! అనే నీతిబోధలూ, ధర్మశాస్త్రాలూ, న్యాయశాస్త్రాలూ అన్నీ నిరర్థకాలేనన్నమాట!'

శాస్త్రి దిక్కులు చూస్తూ నడుస్తున్నాడు. కొంచెం నడకవేగంకూడా పెంచాడు. గోపాలం కూడా వేగంగా నడుస్తూ అన్నాడు.

'శాస్త్రిగారూ, నాకో చిన్న సందేహం కలుగుతోంది.'

'ఏమిటో అది?' విసురుగా అన్నాడు శాస్త్రి.

"మానవుని బుద్ధి స్వతంత్రంగా పనిచెయ్యదుకదా? అది భగవంతుని నిర్ణయానికి బద్ధమై నడుస్తుంది కదా? అలాంటప్పుడు భగవంతుడు అందరిచేతా మంచి పనులే ఎందుకు చేయించడో?"

శాస్త్రికి చిర్రెత్తుకొచ్చింది. జవాబు తోచక తికమకపడ్డాడు.

"ఏమయ్యా గోపాలం! నువ్వేనాడయినా గుడికెళ్ళిన పాపాన పోయావా?" శాస్త్రి స్వరంలో తిరస్కారం కొట్టొచ్చినట్లు వినిపించింది.

గోపాలం పకపక నవ్వాడు. 'ఎందుకండీ అంత చిరాకు? నేను అడిగినదానికి మీరు జవాబివ్వనేలేదు. పోనివ్వండి. నేనే మీ ప్రశ్నకు జవాబిస్తాను. చిన్నప్పుడు అమ్మతో ప్రతి శనివారం ఆంజనేయస్వామి గుడికి వెళ్ళేవాణ్ణి. ఎందుకో తెలుసా? ప్రసాదంకోసం. ఊహ తెలిశాక ఎన్నడూ వెళ్ళలేదు. నా మనస్సు ఇంకా నిర్మలంగానే ఉంది. దేవాలయానికి వెళ్ళి పాపాలను ప్రక్షాళనం చేసుకోవలసిన అవసరం ఇంకా కలగలేదు.' గోపాలం

ఆవేశంగా అనేశాడు.

'అంటే నీ ఉద్దేశం? గుడికి వెళ్ళేవాళ్ళంతా పాపాలు చేసినవాళ్ళనేనా?' ఆ స్వరంలోని తీవ్రతకు గోపాలం ఓ నిముషం ఆగి నడక సాగించాడు.

"నేనలా అనలేదే? కాని ఎక్కువమంది అలాంటివారనే నా అభిప్రాయం. కొంతమంది కోర్కెలు తీర్చమని వెళ్ళితే, కొంతమంది కష్టాలు తీర్చమని వెళతారు. కేవలం భక్తిభావంతో వెళ్ళేవాళ్ళు ఎంతమంది ఉంటారు చెప్పండి?"

"ఏమో నాకేం తెలుసూ? అదీ నువ్వే చెప్పూ!" వత్తి రాగం తీస్తూ అన్నాడు శాస్త్రి.

గోపాలానికి నవ్వొచ్చింది. నవ్వితే శాస్త్రి మరీ ఉలుక్కుంటాడని వచ్చే నవ్వును పెదవుల మధ్య బంధించాడు.

'ఇవ్వాళ తమరిదగ్గర చాలా ముఖ్య విషయం నేర్చుకున్నాను. ఆజన్మాంతం మీకు కృతజ్ఞుడనై ఉంటాను' అన్నాడు గోపాలం మామూలుగానే. కాని శాస్త్రికి ఆ స్వరంలో వ్యంగ్యం విన్పించింది.

"ఏవిఁటో అదీ!" ప్రతి అక్షరం ఒత్తి పలికాడు.

"పాపం చేసిన వ్యక్తి బాధపడనక్కరలేదు; భగవంతునికికూడా భయపడనక్కరలేదు."

శాస్త్రి ఠక్కున ఆగిపోయాడు. ఓ నిముషం ఆశ్చర్యంగా గోపాలం మొహంలోకి చూశాడు.

"రామ! రామ! నేను అలాగన్నానా?"

'ఇంతకుముందే కదండీ అన్నారు; బుద్ధి స్వతంత్రమైంది కాదనీ, అంతకుముందే వ్రాసిపెట్టిన ప్రకారమే ఆ బుద్ధి నడుస్తుందనీను! పుణ్యం చేయించినా పాపం చేయించినా ఆ పరమాత్ముడే కాబట్టి మానవుడు ఎందుకు భయపడాలి?'

"మీలాంటి నాస్తికులకు ఎలా సమాధానాలు చెప్పాలో నాకు తెలియదు. మేము మా గురువులు చెప్పినదాన్ని నమ్మాం. అంతేకానీ మీలా కుంటి ప్రశ్నలు వెయ్యలేదు" అన్నాడు శాస్త్రి అంతకంటే ఏం అనాలో తోచక.

"అరే! మాటల్లో చాలా దూరం నడిచాం. అలా పబ్లిక్ గార్డెన్‌లోకి వెళ్ళి కాసేపు కూర్చుందాం పదండి!" అన్నాడు గోపాలం. మనస్సు బాగాలేని తనకు మంచి కాల క్షేపమే దొరికింది అనుకున్నాడు.

"ఎందుకు నాయనా, నీ ప్రశ్నలతో నా ప్రాణాలు తోడెయ్యడానికా?"

గోపాలం ముసిముసిగా నవ్వుకున్నాడు.

అంతలో ఏదో శవం ఎదురయింది. శవవాహకులు 'హరేరామ హరేరామ' అంటున్నారు. కొందరి మొహాల్లో విషాదం అలుముకొని ఉంది. చనిపోయినవాని కొడుకు నిప్పుకుండ పట్టుకుని తలవంచుకొని నడుస్తున్నాడు.

"అట్లా ఎదురెళతావేం? కొంచెం తప్పుకో!" అంటూ శాస్త్రి గోపాలం రెక్క పట్టుకొని పక్కకు లాగాడు. పేవ్‌మెంటు మీద ఓరగా నిల్చొని, కళ్ళు మూసుకుని భగవంతుని ధ్యానించాడు. 'భగవాన్! ఈ మృతుని ఆత్మకు శాంతి కలుగునట్లు చెయ్.'

గోపాలం శాస్త్రినే చూస్తూ నిల్చున్నాడు. చావు బ్రతుకుల గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. బ్రతుకులో ఉండి, చావులో లేనిది ఏమిటి? అంతవరకు ప్రవహించే అంతర్వాహిని ఒక్కసారిగా యెలా ఎండిపోతుంది? ఆ చైతన్య స్రవంతి

అకస్మాత్తుగా యెలా గడ్డకట్టుకుపోతుంది? బ్రతుకులో ఉన్న సమస్యలూ, బాధలూ చావులో ఉండవు. కాని మానవుడు చావంటే ఎందుకు భయపడతాడో? బహుశా తను లేని ఈ ప్రపంచాన్ని ఊహించుకొని సహించలేకనేమో?

"ఇవ్వాళ ముక్కోటి ఏకాదశి! ఎంత పుణ్యం చేసుకుంటే ఇవ్వాళ చావు లభిస్తుంది!" తన్మయత్వంతో అన్నాడు శాస్త్రి.

"అదేంటండోయ్! ఆ చావు మీకే లభించినంత ఆనందపడిపోతున్నారు" అనేసి గబుక్కున నాలుక కరచుకున్నాడు గోపాలం.

శాస్త్రి చురచురా చూశాడు గోపాలం మొహంలోకి.

గోపాలం తన చూపుల్ని మరోవైపుకు తిప్పుకున్నాడు. శాస్త్రి కోపాన్ని గమనించనట్లే అన్నాడు. 'అయితే గురువుగారూ! ఇవ్వాళ చనిపోయిన వాళ్ళ ఆత్మ తిన్నగా వైకుంఠానికే వెళుతుందంటారు - అవునా?'

ఆ ప్రశ్న మళ్ళీ శాస్త్రిని తన్మయంలోకి నెట్టేసింది. 'అవునయ్యా గోపాలం! ఇవ్వాళ్టి రోజు వైకుంఠ ద్వారాలన్నీ బార్లా తెరిచి ఉంటాయి. తిన్నగా ఆ శేషతల్పశాయి పాదపద్మాల దగ్గరకే వెళ్ళిపోవచ్చును.' అరమోడ్పు కన్నులతో సాక్షాత్తూ తనే వెళ్ళి ఆ శేషతల్పశాయి పాదాల దగ్గిర నిల్చున్నట్లు ఆనందపారవశ్యంతో అన్నాడు.

'అయితే స్వామీ! ఆత్మ అనేది ఒకటి ఉందంటారు?'

"అయ్యో! అయ్యో! ఎంతమాట? ఈ క్షణభంగురమైన శరీరంలో అమరమైన ఆత్మ ఉంటుంది. ఆత్మకు చావు లేదు. ఆత్మ అమరం. ఈ శరీరం కేవలం మన వొంటిమీద చొక్కాలాంటిది. అది మాసిపోతే తీసేసి మరొకటి ధరిస్తాం. అలాగే ఆత్మకూడా శిథిలమైన శరీరాన్ని విసర్జిస్తుంది."

'మరి ఒకోసారి పసి శరీరాన్ని, మంచి వయసులో ఉన్న శరీరాల్ని కూడా అకస్మాత్తుగా వదిలేస్తుంది మీ ఆత్మ?'

శాస్త్రి ముఖంలో కోపం చిక్కుపడింది. 'అదంతా పూర్వజన్మ సుకృత విశేషం. ఈ భూమిమీద వారికి ఎంత రుణం ఉంటే అంతే అనుభవించి వెళ్ళిపోతారు.'

'కొందరు పుట్టగానే ఏమీ అనుభవించకుండానే వెళ్ళిపోతారు. కొందరు పుడుతూనే జీవరహితంగానే పుడతారు?'

శాస్త్రి ముఖంలో చిక్కుపడిన కోపం పీటముడిగా మారింది. పలక్కుండా నడుస్తున్నాడు.

'కోపం వచ్చినట్లుందే?'

'కోపం ఎందుకూ?' కోపంగా సాగదీస్తూ అన్నాడు శాస్త్రి.

'ఒక్క ప్రశ్న అడగమంటారా?'

'ఊఁ. వద్దంటే ఊరుకుంటావా? అడుగూ!'

"ఆత్మ అంటే ఏమిటి స్వామీ! దానిని ఈ శరీరం తాలూకు ఆధివ్యాధులూ, ఈతిబాధలూ సోకుతాయా? ఈ శరీరంతోపాటు మనిషిలోని ఆత్మకూడా బాధకు గురి అవుతుందా?" గోపాలం తెచ్చిపెట్టుకొన్న వినయంతో ప్రశ్నించాడు.

శాస్త్రి ముఖంలో కోపం ముడివిడిపోయింది. 'అలారా దారికి!' అనుకున్నాడు. ముఖం గంభీరంగా మారిపోయింది.

"శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి- వీటి అన్నిటికీ అతీతమైంది, సత్-చిత్-ఆనంద స్వరూపమైంది ఒకటి ఉంది. అదే ఆత్మ. ఆత్మ స్వయం ఆనంద స్వరూపం. దానికి బాధలేమిటీ? ఆత్మ కేవలం ఆ పరమాత్మ అంశమే. దానికి శరీరం తాలూకు ఆధివ్యాధులుకానీ, కల్మషంగానీ అంటవు." ఉపన్యాసం ఇస్తున్న ధోరణిలో చెప్పుకు పోతున్నాడు.

"మీలోనూ, నాలోనూ ఉన్న ఆత్మ ఒకటేనా స్వామీ?"

"అక్షరాలా! నీలోనూ, నాలోనూ. ఆమాటకొస్తే సమస్త జీవరాసుల్లో ఉన్న ఆత్మ స్వరూపం ఒకటే. అంతా ఆ పరమాత్మ అంశం. యోగమాయచేత కప్పబడిన ఆత్మ తన అసలు స్వరూపాన్ని విస్మరించి ఈ భౌతిక సుఖాల కోసం ప్రాకులాడుతుంది." గొప్ప తత్వవేత్తలా మొహంపెట్టి మాట్లాడుతున్న శాస్త్రిని చూస్తుంటే గోపాలానికి నవ్వొచ్చింది.

"ఎందుకయ్యా నవ్వుతావ్?" ఉక్రోషంగా ప్రశ్నించాడు శాస్త్రి.

'పరస్పర విరుద్ధంగా ఉండే మీ సిద్ధాంతాలను వింటుంటే నవ్వొస్తుంది' అన్నాడు గోపాలం చిరునవ్వుతో.

శాస్త్రికి అగ్గిలో వేసి పొర్లించినట్లుంది.

'రండి, అలా బెంచీమీద కూర్చుందాం.' శాస్త్రి జవాబుకు ఎదురుచూడకుండానే గోపాలం పబ్లిక్ గార్డెన్ గేటుకు దగ్గిరగా ఉన్న బెంచీమీద కూర్చున్నాడు. శాస్త్రి గోపాలాన్ని యాంత్రికంగా అనుసరించాడు. అతని మనస్సు గోపాలం వేసిన ప్రశ్న చుట్టూ తిరుగుతోంది. ఈ గడుగ్గాయి చిన్నప్పటినుంచీ ఇంతే. అప్పటికి గోపాలానికి మహావుంటే ఎనిమిదేళ్ళుంటాయేమో! ఒకనాడు తను గోపాలం నాన్నతో ఎవరో చచ్చిపోయారని చెబుతున్నాడు. ఆ పక్కనే బొమ్మల పుస్తకాల్లోని బొమ్మల్ని కత్తిరిస్తూ కూర్చున్న గోపాలం లేచి తండ్రి దగ్గరకొచ్చాడు.

"ఎట్లా చచ్చిపోతారు?" గోపాలం ప్రశ్నించాడు తండ్రిని.

"చచ్చిపోతారు. అంతే!" అన్నాడు తండ్రి యింకేం చెప్పాలో తోచక.

"చచ్చిపోవటం అంటే?" గోపాలం ప్రశ్నించాడు మళ్ళీ.

"నువ్వెళ్ళి పడుకో. వెధవ ప్రశ్నలూ నువ్వూనూ." తండ్రి కసురుకున్నాడు. జవాబు తోచక గోపాలం కదల్లేదు.

'చచ్చిపోవటం అంటే ప్రాణం పోవటం.' శాస్త్రి జవాబిచ్చాడు.

'ప్రాణం పోవటం అంటే?'

'ప్రాణం పోవటం అంటే మాట్లాడరు. నడవరు. నువ్వాడుకొనే బాట్‌లా బిగుసుకుపోతారు. అప్పుడు వాళ్ళను కాల్చేస్తారు' అన్నాడు శాస్త్రి.

ఓ నిముషం పసివాడి మొహంలో భయం, కుతూహలం ఒకదాన్నొకటి తోసుకొని వచ్చాయి.

"ప్రాణం ఎలా పోతుంది?"

"ప్రాణం ఎగిరిపోతుంది."

"ప్రాణానికి పక్షికిమల్లే రెక్కలుంటాయా?" ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేస్తూ ప్రశ్నించాడు.

"కాదు... అవును..." పసివాడికి ఏం జవాబు చెప్పాలో తోచక శాస్త్రి

తికమకపడ్డాడు.

'ప్రాణం ఎక్కడనుంచి వస్తుంది?'

'భగవంతుడి దగ్గరనుంచి.' గోపాలం తండ్రి జవాబిచ్చాడు.

'ఎక్కడికి మళ్ళీ ఎగిరిపోతుంది?'

'భగవంతుడి దగ్గరకే.'

'భగవంతుడే మళ్ళీ తీసుకుంటాడా?'

'ఆఁ అవును!' శాస్త్రి జవాబిచ్చాడు.

'జపాను, అమెరికా వాళ్ళ ప్రాణాలుకూడా భగవంతుడి దగ్గరికే పోతాయా?'

'అవును' అనేశాడు శాస్త్రి.

"యుద్ధంకూడా భగవంతుడే చేయిస్తున్నాడా?"

"అవును."

"అయితే భగవంతుడు మంచివాడు కాదా?"

శాస్త్రీ, గోపాలం తండ్రీ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. వాకిట్లోకి వచ్చిన కుక్కపిల్లను చూసి గోపాలం అన్నీ మర్చిపోయి దాని దగ్గరకు పరుగెత్తాడు...

"ఏమండీ గురూజీ! చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? నా ప్రశ్నకు జవాబివ్వలేదు?"

ఉలిక్కిపడి ఆలోచనల్నుంచి బయటపడ్డాడు శాస్త్రి. 'నీ ప్రశ్నలకు ఆనాడే జవాబివ్వ లేకపోయాను. ఇవ్వాళేం ఇవ్వగలను?' అనుకున్నాడు మనస్సులోనే. పైకి గాంభీర్యంగా అన్నాడు: "నా సిద్ధాంతాలు పరస్పరం పైకి విరుద్ధంగా ఉన్నాయి అన్నావు- అవునా?"

"అవునండీ! ఒకవైపు ఆత్మ ఆనంద స్వరూపం. స్వయం స్వతంత్రమైంది అంటు న్నారు. దానికి శరీరం తాలూకు ఈతిబాధలు, కల్మషం అంటవన్నారు. మరోవైపు యోగ మాయచేత కప్పబడిన ఆత్మ ఐహికసుఖాలకోసం ఆరాటపడుతుందంటున్నారు. స్వయం స్వతంత్రమూ సాక్షాత్తూ పరమాత్మ అంశమూ ఆయన ఆత్మను యోగమాయ కప్పివేయటం ఏమిటి స్వామీ? ఇందాక శవం ఎదురైనప్పుడు 'మృతుని ఆత్మకు శాంతి కలుగుగాక' అన్నారు. సత్-చిత్-ఆనంద స్వరూపం అయిన ఆత్మకు శాంతి కలగటం ఏమిటి స్వామీ? ముక్కోటి ఏకాదశిరోజు చనిపోయిన వాడి ఆత్మ తిన్నగా వైకుంఠం చేరుతుందన్నారు. అసలు ఆ ఆత్మే పరమాత్మ అంశం అయినప్పుడు అక్కడికి చేరుకోక మరెక్కడికి చేరుకుంటుంది? పైగా చావు, బ్రతుకు లనేవి ఈ భౌతిక కాయానికి సంబంధించినవి కదా? మరి..." గోపాలం శాస్త్రి మొహంలోకి చూసి ఠక్కున ఆగిపోయాడు.

ఆయన నుదురుమీద ముత్యాల్లా స్వేదబిందువులు దొర్లుతున్నాయి. కోపంతో ఆ పచ్చని మొహం రాగివర్ణాన్ని పులుముకుంది. చిటికలో మిగిలిపోయిన ముక్కుపొడుంను గట్టిగా పీల్చాడు. అది నసాళానికి అంటి ఉక్కిరిబిక్కిరయ్యాడు. గోపాలానికి అతని మీద జాలివేసింది. పెద్దవాడు. అతని నమ్మకాలతనివి. తనకెందుకు?. కాని ఇలాంటివాళ్ళు వాళ్ళ నమ్మకాలను ఇతరుల నెత్తిన రుద్దటానికి ప్రయత్నిస్తారు. అందుకే తనకు వళ్ళుమంట.

"ఒకసారి యింటికి రండి! నాన్నగారు ఒకటే కలవరిస్తున్నారు" అన్నాడు గోపాలం మాట మారుస్తూ.

"అలాగేనోయ్!" తేరుకుంటూ అన్నాడు శాస్త్రి.

"ఇవాళ ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో పదహారు సంవత్సరాల కుర్రాడు పెట్రోలు పోసుకొని

నిప్పంటించుకొని, మూడువందల గజాల ఎత్తునుంచి కిందవున్న బావిలోకి దూకుతాడట! వెళదామా చూట్టానికి?" అడిగాడు శాస్త్రి గోపాలాన్ని మళ్ళీ మొదటికి రాకుండా ఉంచే ప్రయత్నంలో.

గోపాలం ఆశ్చర్యంగా శాస్త్రి మొహంలోకి చూశాడు.

"మీకు ఇలాంటి ఇన్‌టరెస్టులుకూడా ఉన్నాయా?"

'ఏదో సరదా.' ఘొల్లున నవ్వాడు శాస్త్రి. ఘొల్లున నవ్వింది దేనికో తెలియని గోపాలం కళ్ళుప్పగించి చూశాడు.

'అవును! సహజమే! ఇతరులను అపాయంలో చూట్టం అంటే ఎక్కువమంది మనుష్యులకు సరదాగానే ఉంటుంది.'

శాస్త్రి అర్థంకాక నొసలు ముడిచి గోపాలంకేసి చూశాడు.

'బాక్సింగ్, సర్కస్, పులులమధ్య సింహాలమధ్య కూర్చుని వాటిని రెచ్చగొట్టటం. ఇలాంటివి చూట్టానికి మనుష్యులు ఎందుకు విరగబడతారంటారు గురువుగారూ?'

'ఎందుకేమిటి? అదో సరదా! కాలక్షేపం! ఇందులో ఇతరులు అపాయంలో ఉంటే చూసి సంతోషించటం అనే ప్రసక్తి ఏముంది?' విసుగ్గా ఉంది శాస్త్రి స్వరం.

'మరీ అంత విసుక్కోకండీ! ఎవడైనా పిల్లులతో, కుక్కలతో ఆడతారంటే జనం విరగబడరేం? ఎవడైనా పదిగజాల ఎత్తునుంచి నేలమీదకు దూకుతాడంటే టికెట్ కొనుక్కొని చూట్టానికి వెళతారా?'

'ఎందుకెళతారు? అందులో ఏం విశేషం ఉంది గనుక?'

'అందులో ఏం విశేషం ఉంది అనకండి! అందులో ఏం అపాయం ఉంది అనండి!'

"అంటే నీ ఉద్దేశ్యం ఇలాంటివి చూడాలని కుతూహలం పడటంలో క్రూరత్వం ఉందంటావు?"

"ఒకరకంగా అంతే! మనిషి జంతువులనుంచి వచ్చాడనేదానికి నిదర్శనం ఇది. చాలమంది మనుషుల్లో ఇంకా జంతు లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. కొందరిలో నిగూఢంగా ఉంటాయి. మానవుడిలోని ప్రాథమిక గుణాలకు అంటే పాశవిక ప్రవృత్తులకు సంతృప్తి కావాలి."

"ఏమో గోపాలం! నీ వాదన నాకు అర్థంకాదు. ఇంతకీ నువ్వు ఎగ్జిబిషన్ గ్రౌండ్సుకు వస్తావా రావా?" నిలదీసినట్లు ప్రశ్నించాడు శాస్త్రి.

గోపాలానికి ఇలాంటి దృశ్యాలను చూట్టం ఇష్టముండదు. చిన్నప్పుడు తమ ఊళ్లో దొమ్మరివాళ్ళు గడకర్రలమీద పిల్లిమొగ్గలు వేస్తుంటేనే చూడలేక కళ్ళు మూసుకునేవాడు. పిల్లలంతా గోపాలాన్ని పిరికిపందగా భావించి గేలి చేసేవారు.

ఈరోజు గోపాలం మనస్సేమీ బాగాలేదు. శాస్త్రితో కాలక్షేపం బాగుందనిపించింది. "వస్తాను పదండి!" అనేశాడు.

ఇద్దరూ ఎగ్జిబిషన్ గ్రౌండ్సుకు వచ్చేసరికి బాగా చీకటిపడింది. ఎగ్జిబిషన్ ఆవరణలో దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. జనం వస్తూనే వున్నారు. ఆడవాళ్ళూ పిల్లలూ మరీ ఎక్కువగా ఉండటం గోపాలానికి ఆశ్చర్యాన్ని కలిగించింది. 'ఇలాంటివాటికి పిల్లల్ని తీసుకురావటం ఎందుకో!' అనుకున్నాడు గోపాలం.

టిక్కెట్టు కొనుక్కుని బావి దగ్గరకు వెళ్ళారు. అప్పటికే జనం చుట్టూ కూర్చొని

వున్నారు. ఇప్పటినుంచే ఆ జనంలో కూర్చోవటం గోపాలానికి నచ్చలేదు. అసలు గోపాలానికి ఆ దృశ్యం చూడాలనిపించలేదు. ఆ కుర్రాణ్ణి ఒకసారి చూడాలని ఉంది. శాస్త్రి కళ్ళు ఎవరికోసమో వెతుకుతున్నట్లనిపించింది గోపాలానికి. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ దూరంగా నడిచారు. కొంచెం దూరంలో ఓ చిన్న గుంపు కనిపించి అటు నడిచారు. జనం పది పదిహేనుమందికంటే ఎక్కువలేరు. మధ్యలో కాకీ దుస్తుల్లో ఓ కుర్రాడు నిల్చొని ఉన్నాడు. చుట్టూ చేరి జనం ఏదేదో అడుగుతుంటే ఉత్సాహంగా జవాబు లిస్తున్నాడు. ఆ కుర్రాడు ఎవరో గోపాలానికీ, శాస్త్రికీ అర్థం అయింది. ఆత్రంగా జనంలోకి చొచ్చుకుపోయారు.

అంతలో గుబురు మీసాల వ్యక్తి ఒకడు చుట్టూ మూగిన జనాన్ని తప్పుకోమని మందలించాడు. అతను శాస్త్రిని చూస్తూనే చేతులు జోడించి నమస్కరించాడు. శాస్త్రికి మొహం విప్పారింది.

"అయ్యవార్లుగారూ! రండి! రండి! పొద్దున తమకోసం కబురు పెట్టాను" అన్నాడు అతడు, అయ్యవార్లు స్వయంగా సాక్షాత్కరించినందుకు సంతోషపడుతూ.

"కబురందింది యాదగిరీ! ఉదయం రావటానికి తీరిక చిక్కలేదు. అందుకే ఇప్పుడు వచ్చాను" అన్నాడు అవధాన్లు.

"తమరు టికెట్ కొనుక్కొని రావటం ఏమిటి అయ్యవారూ? నాకు కబురు చేస్తే స్వయంగా వచ్చి తీసుకొచ్చేవాణ్ణిగా?"

"దానికేంలే! ఈ కుర్రాడు కొన్నాడులే టికెట్లు. నాక్కావాల్సిన కుర్రాడేలే!" అన్నాడు శాస్త్రి. యాదగిరి గోపాలానికి నమస్కరించాడు. గోపాలం కూడా మౌనంగా నమస్కరించాడు. యాదగిరి ఆ కుర్రాణ్ణి, శాస్త్రినీ, గోపాలాన్నీ తీసుకొని జనంలోంచి దారితీశాడు. శాస్త్రికీ, యాదగిరికీ ఉన్న సంబంధం ఏమిటో ఆలోచిస్తున్నాడు గోపాలం.

బావికి పదడుగుల దూరంలో చుట్టూ మూయకట్టిన డేరాలోకి నలుగురూ వెళ్ళి కూర్చున్నారు.

"ఎల్లుండి కొత్త ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేయిద్దామని తమరికి కబురు పెట్టాను" అన్నాడు యాదగిరి.

యాదగిరి గత పాతికేళ్ళుగా తిరునాళ్ళలోనూ, మెర్రీ గోరౌండ్సూ, లక్కీడిప్పులు, చట్కాలూ చిట్కాలూ కలిపి అనేక తమాషాలు చేయించి, జనానికి వినోదాన్ని అందించి ఓ లక్ష రూపాయలదాకా సంపాదించాడు.

కొత్త యిల్లు కట్టించాడు. పూజలకూ, పునస్కారాలకూ శాస్త్రినే పిలుస్తూ ఉండేవాడు. యాదగిరికి పాపభీతి లేకపోయినా దైవభక్తిపరాయణుడు.

"అలాగే! దివ్యంగా చేయిస్తాను." శాస్త్రికి మనసు సత్యనారాయణ వ్రతంలో పొందబోయే సంభావనల మీదకు మళ్ళగా, కళ్ళు మాత్రం ముచ్చటగా; గంభీరంగా కూర్చుని వున్న కుర్రాడిమీదే ఉన్నాయి. యాదగిరి కుర్రాణ్ణి పరిచయం చేశాడు.

శాస్త్రిని కుతూహలంగా చూస్తూ చేతులు జోడించాడు ఆ కుర్రాడు. పచ్చగా, బొద్దుగా ఉన్నాడు. ముఖ కవళికలు స్పష్టంగా, ఆకర్షణీయంగా ఉన్నాయి. ఒత్తుగా ఉన్న కనుబొమల క్రింద ఉన్న ఆకర్షణీయమైన ఆ కళ్ళలో ఎన్నో ఆశలూ, భావాలూ తొణికిసలాడుతున్నాయి. దృఢంగా కొంచెం పెద్దదిగా ఉన్న పై పెదవి మీద స్పష్టంగా

కనిపిస్తున్న నల్లని చార అతని శరీరాన్ని ఆక్రమించబోతున్న యవ్వనాన్ని ఎత్తి చూపిస్తుంది. ఆ అందమైన ముఖాన్ని విడవలేక బాధపడుతున్నదా అన్నట్లు ఇంకా పసితనం కొట్టొచ్చినట్లు కనిపిస్తూంది.

యాదగిరి శాస్త్రినీ, గోపాలాన్నీ, కుర్రాడితో టెంటులో వదిలేసి 'ఇప్పుడే వస్తా'నంటూ బయటకు వెళ్ళాడు.

'ఈ కుర్రాడు చచ్చిపోతే!' గోపాలం హృదయం కంపించింది. "నీ పేరేమిటోయ్?" శాస్త్రి కుర్రవాడిని కుతూహలంగా ప్రశ్నించాడు.

"నాగేశ్!" కుర్రాడి కంఠంలోంచి మాటలు వెదురుబొంగు పగిలి గాలికి శబ్దం చేస్తున్నట్లు వచ్చాయి.

ఈ వయస్సులో ఉండే కుర్రవాళ్ళ స్వరం తమాషాగా ఉంటుంది అనుకున్నాడు గోపాలం.

"ఎంతకాలంగా ఈ ఫీట్స్ చేస్తున్నావ్?" గోపాలం ప్రశ్నించాడు.

"ఇదే మొదటిసారండీ!" జవాబిచ్చాడు కుర్రవాడు.

"మొదటిసారా? భయం వెయ్యటం లేదూ?" గోపాలం నాగేశ్ కళ్ళలోకి లోతుగా జాలిగా చూస్తూ ప్రశ్నించాడు. ఎంత కళగల మొహం. చదువుకున్న వాడిలా ఉన్నాడు.

నాగేశ్ నవ్వాడు. నవ్వినప్పుడు నాగేశ్ ముఖం నూరు కాండిల్స్ బల్బ్ వేసినట్లు వెలిగిపోయింది. ఆ నవ్వులో గర్వం ఇమిడివుంది.

"భయమా? ఎందుకూ?" ఎదురు ప్రశ్న వేశాడు నాగేశ్ చిరునవ్వుతో. విశ్వాన్ని జయించడానికి బయలుదేరిన సికిందర్‌ను ఆ ప్రశ్న అడిగితే బహుశా నాగేశ్‌లాగే నవ్వి, నాగేశ్‌లాగే ఎదురు ప్రశ్న వేసి ఉండేవాడేమో ననిపించింది గోపాలానికి.

'ఈ విద్యను నువ్వు ఎవరిదగ్గర నేర్చుకున్నావ్?' శాస్త్రి ప్రశ్నించాడు.

'ఎవరి దగ్గరా నేర్చుకోలేదు. మా కుటుంబం వృత్తే ఇది' అన్నాడు నాగేశ్.

'అంటే మీ నాన్నకూడా ఇదే పని చేసేవాడా?' గోపాలం ఆత్రంగా అడిగాడు.

"అవును. మా నాన్నే కాదు, మా నాన్న నాన్నా, వాళ్ళ నాన్నా కూడా ఇదేపని చేశారు" అన్నాడు నాగేశ్ ఉరకలు తీస్తున్న ఉత్సాహంతో.

"మీ నాన్న ఉన్నాడా?"

"లేదండీ. మా నాన్న పోయిన సంవత్సరం పూనాలో ఈ ప్రదర్శన ఇస్తూ చనిపోయాడు."

గోపాలం ఉలిక్కిపడ్డాడు. నాగేశ్ కళ్ళలోకి లోతుగా చూశాడు. తండ్రిని జ్ఞాపకం చేసుకోవటం వల్ల నీరు నిండిన ఆ కళ్ళలో ఏమీ కనిపించలేదు గోపాలానికి.

"మీ తాత ఎలా చనిపోయాడు?" గోపాలం కంఠంలో బాధ ధ్వనించింది.

'మా తాతకూడా ఎంతో కాలం ఈ వృత్తిమీదే బ్రతికాడు. కాని చివరకు ఈ ఫీట్ చేస్తూనే చనిపోయాడట.'

'మరి వాళ్ళ నాన్న?' ఆదుర్దాగా ప్రశ్నించాడు గోపాలం. శాస్త్రికి గోపాలం ప్రశ్నలు విసుగు పుట్టించాయి.

'ఆయన మామూలుగా ఏదో జబ్బుచేసి చచ్చిపోయాడట.' చిరునవ్వుతో జవాబిచ్చాడు నాగేశ్.

గోపాలం నిట్టూర్పు విడిచాడు.

'ఇదంతా తెలిసే నువ్వీ సాహసం చేస్తున్నావా?' గోపాలం ప్రశ్న నాగేశ్‌ను ఉద్దేశించి వేసినా తనకు తానే వేసుకున్నట్లుంది. దూరంగా నాగేశ్ భవిష్యత్తును చూట్టానికి ప్రయత్నిస్తున్నాడు.

నాగేశ్ కిలకిల నవ్వాడు. గోపాలం వెర్రి మొహం వేసి నాగేశ్ మొహంలోకి చూశాడు.

"బాబుగారూ! ఒకవేళ మీ నాన్నగారూ, ఆయన నాన్నగారూ ఆఫీసులో పనిచేస్తూ చచ్చిపోయారనుకోండి. మీరు ఆఫీసులో పనిచెయ్యటానికే భయపడతారా?" నాగేశ్ ప్రశ్నకు ఏం సమాధానం ఇవ్వాలో గోపాలానికి తోచలేదు. ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు ఓ క్షణం.

'అదీ ఇదీ ఒకటెలా అవుతుంది? మీ నాన్న దగ్గర ఈ విద్య నువ్వెందుకు నేర్చుకోలేదు?' ఈసారి ప్రశ్నించటం శాస్త్రి వంతయింది.

'మా నాన్నకు నేను ఈ వృత్తి చేసి బ్రతకటం ఇష్టంలేదు. మా నాన్న ఈ ఫీట్ చేస్తున్నప్పుడు అసలు నన్ను చూడనిచ్చేవాడే కాదు. ఒకటి రెండుసార్లు నేనే దొంగతనంగా వెళ్ళి జనంలో కూర్చొని చూశాను. అది తెలిసి మా నాన్న నన్ను బాగా కొట్టాడుకూడా.'

'మీ నాన్నకు నువ్వు ఏం పని చెయ్యాలని ఉండేది?' గోపాలం కుతూహలంగా ప్రశ్నించాడు.

'బాగా చదువుకుని మంచి ఉద్యోగం చెయ్యాలని ఉండేది.'

'ఏం చదువుకున్నావ్?' శాస్త్రి ప్రశ్నించాడు.

'మొన్ననే స్కూల్ ఫైనల్ పరీక్ష రాశాను.'

నాగేశ్ జవాబుకు విస్తుపోయి చూశారు ఇద్దరూ.

'మరి అంత చదువుకుని ఇదేం పని? మీ నాన్న కోరిక ప్రకారం ఏదైనా ఉద్యోగం చూసుకోకూడదూ?' అన్నాడు గోపాలం.

నాగేష్ అదోలా, ఎంతో కాచి వడపోసినవాడిలా నవ్వాడు.

"బాబుగారూ, ఇంకా మీకు పరిస్థితులు తెలిసినట్లు లేవు. ఈ రోజుల్లో ఎం.ఏలూ, బి.ఏలూ ఉద్యోగాలు దొరకక తిరుగుతున్నారు. స్కూలు ఫైనలు చదివిన నాకు, ముఖ్యంగా రికమండేషన్ ఏమీ లేకుండా ఉద్యోగం ఎవరిస్తారు? వినలేదూ! ఈ మధ్య ఇంజనీరు పాసయిన ఒక యువకుడు యల్.డి.సిగా చేరటానికి వెళ్తే ఆ ఆఫీసరు చేర్చుకోను పొమ్మన్నాడట. ఏ బి.ఎ పాసయినవాడో అయి ఉంటాడు. రాజకీయ పక్షుల రెక్కల నీడలో ఆ కుర్చీని సంపాదించి ఉంటాడు. తనకంటే ఎక్కువ చదివినవాణ్ణి తన క్రింద ఉద్యోగంలో వేసుకోవడం ఏనాటికైనా తనకే ముప్పని భయమో ఏంపాడో!" ఉద్రేకంగా మాట్లాడుతున్న నాగేష్ లేతబుగ్గల్లో రక్తం చిమ్మింది. గోపాలం ఆ కుర్రవాడి విజ్ఞానానికి విస్మయం చెందాడు.

'అయితే; ఇంత చదువూ చదివి జీవితమంతా ఇదే వృత్తి చేస్తావా?' శాస్త్రి ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకు నాగేష్ ముఖం మీద వయస్సుకు మించిన గాంభీర్యం అలుముకుంది. ఓ క్షణం మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు. అంతలో నాగేష్ కళ్ళలో కదిలిన కాంతి

రేఖల తాలూకు వెలుగు మొఖంమీది గాంభీర్యాన్ని కప్పివేసింది.

"లేదు. నేను ఇంకా చదువుతాను. ఐ.ఏ.యస్. పాసవుతాను. కలెక్టరవుతాను." దూరంగా చూస్తూ అన్న ఆ మాటలు తనకు తనే తన నిర్ణయాన్ని వినిపిస్తున్నట్లున్నాయి.

"నువ్వు తప్పక గొప్పవాడివి అవుతావురా కుర్రోడా! నీ ముఖంలో రాచకళ ఉట్టిపడుతోంది. ఆ నుదురు చూడవయ్యా గోపాలం! ఎంత ప్రశస్తంగా ఉందో ఆ లలాటం!" అన్నాడు శాస్త్రి ఉత్సాహంగా.

"శాస్త్రిగారూ! నాగేష్ చెయ్యి చూడండి" అన్నాడు గోపాలం.

నాగేష్ కుతూహలంతో ఓ నిమిషం శాస్త్రి వైపూ, మరో నిమిషం అతని చేతిలోని పంచాంగంవైపూ చూసి, కుడిచేతిని ముందుకు చాచాడు.

శాస్త్రి చెయ్యి అందుకొని పరీక్షగా చూశాడు. "ఆహాఁ! ఎంత అదృష్ట జాతకుడి వోయ్! నువ్వు. తప్పక కలెక్టర్ అవుతావు. అప్పుడు నాకు పట్టు పంచలచాపు పెట్టాలి సుమా!" అన్నాడు. నాగేష్ మొహం సిగ్గుతో కందిపోయింది. పర్సుతీసి ఐదు రూపాయల నోటు తీసి శాస్త్రికిస్తూ వినమ్రతతో మ్రొక్కాడు. శాస్త్రి ఐదు రూపాయల నోటు తీసుకోవటానికి ఓ క్షణం తటపటాయించాడు. మళ్ళీ వద్దు వద్దంటూనే అందుకొని రొంటి మడతలో పొడుంకాయ పక్కగా తోసేశాడు. గోపాలం మనస్సు చివుక్కుమంది. శాస్త్రివైపు నిరసనగా చూశాడు. శాస్త్రి గోపాలాన్ని చూస్తేగా సిగ్గుపడటానికి? గోపాలం బుర్రలోకి ఆకస్మాత్తుగా ఓ ఆలోచన వచ్చింది.

"శాస్త్రిగారూ! నాగేష్ ఎంతకాలం బ్రతుకుతాడో చెయ్యి చూసి చెప్పండి."

నాగేష్ చేతిని పరీక్షగా చూసి "ఎనభయి సంవత్సరాలకు ఢోకాలేదు అన్నాడు శాస్త్రి"

"సరిగ్గా చూడండి!" ఆత్రంగా అన్నాడు గోపాలం.

'అవునయ్యా! చూడు, ఈ రేఖ కోతేరు వేసినట్లు ఎంత తిన్నగా ఉందో! ఎక్కడా చిన్న అడ్డగీతకూడా లేదు'

'అవునయ్యా గోపాలం! ఇలాంటివి నువ్వు నమ్మవుగా? మరి ఇప్పుడూ?'

'ఇప్పుడు నమ్మాలనిపిస్తుంది' అన్నాడు గోపాలం. మరో సమయంలో అయితే గోపాలం ఇలాంటివి నమ్మడు. మనస్సును ఏదో సందేహం పీడిస్తుంటే, ఆ బాధనుంచి విముక్తిని పొందటానికి నమ్మటానికి ప్రయత్నిస్తున్నాడు.

'నాగేష్! ఇంకా చదువుతానన్నావుగా? ఎలా చదువుతావు?' గోపాలం ప్రశ్నించాడు.

'ఈ రెండు నెలలూ శలవలుగా? ఈ రెండు నెల్లూ ఈ ప్రదర్శనలిచ్చి బాగా సంపాదిస్తాను. ఇవ్వాళ ఇప్పటి కిప్పుడే ఐదువందలు కలెక్షన్ అయింది; కనీసం నా వాటాకు వంద రూపాయలైనా వస్తాయి.'

"మిగతా సొమ్ము ఎవరికి పోతుంది?"

"కొంత ఖర్చులకు పోతుంది. మిగిలింది కంట్రాక్టర్ యాదగిరిగారూ, నేనూ సమానంగా పంచుకుంటాం. ఏర్పాట్లన్నీ ఆయనే చేస్తారు."

"ఆఁ- తరువాత?" శాస్త్రి కుతూహలంగా ప్రశ్నించాడు.

"కనీసం ఈ రెండు నెలల్లో మూడు వేలయినా సంపాదిస్తాను. నేను చిన్నవాణ్ణి కాబట్టి ఈ ప్రదర్శనలకు ఇంత డబ్బు వస్తుంది! నాకో అక్కయ్య ఉంది. అక్కయ్యకు పెళ్ళి

కాలేదని అమ్మ రోజూ బాధపడుతూ ఉంటుంది. ఈ డబ్బుతో అక్కయ్యకు పెళ్ళి చేస్తాను. నా చదువుకు కావాల్సింది మధ్య మధ్య శలవుల్లో ఈ ప్రదర్శనలిచ్చి సంపాదిస్తాను." గబగబా ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు నాగేశ్. నయాగరా జలపాతాలు ఎన్నయితే నాగేశ్‌లో ఉరకలు తీస్తున్న ఉత్సాహంతో సమానం అవుతాయి!

"మరి ఈ విద్యను మీ నాన్న దగ్గర నువ్వు నేర్చుకోలేదు. ఎలా చేస్తావు? ఒకవేళ..." గోపాలం గొంతులో అపశృతి పలికింది.

"నాకే అపాయము జరగదు. ఇదిగో చూడండి. ఈ ఆంజనేయస్వామివారి బిళ్ళ! దీన్ని మా నాన్న ఈ ప్రదర్శనలిస్తున్నప్పుడు ధరించేవాడు. మా తాతకూడా ధరించేవాడు. ఇప్పుడు నేనూ వేసుకున్నాగా- నాకే అవాంతరం జరగదు-" అంటూ షర్టుగుండీలు ఊడదీసి, నల్లదారంతో వేలాడుతున్న అరచేతి వెడల్పునున్న రాగిబిళ్ళను చూపించాడు. దానిమీద సంజీవ పర్వతాన్ని అరచేతిలో ఎత్తుకొని ఎగురుతున్న ఆంజనేయస్వామి బొమ్మ స్పష్టంగా కనిపిస్తూంది. ఆ బిళ్ళను కళ్ళ కద్దుకొని, షర్టు లోపలకు వేసుకొని గుండీలు పెట్టుకోసాగాడు.

శాస్త్రి గోపాలం మొహంలోకి సగర్వంగా చూశాడు.

"మీ నాన్న చచ్చిపోయిన రోజు ఇది వేసుకోలేదా?" గోపాలం వేసిన ప్రశ్నకు శాస్త్రికి వళ్ళు మండింది.

"ఊఁహుఁ, మర్చిపోయాడు. ఆ రోజు ఉదయమే మా అమ్మ ఆ బిళ్ళను చింతపండుతో బాగా తోమి తుడిచి, గూట్లోపెట్టి పూజ చేసిందట. మా నాన్న మర్చిపోయి వెళ్ళిపోయాడు. అందువల్లనే మా నాన్న చచ్చిపోయాడని మా అమ్మ చెప్పి చెప్పి ఏడుస్తుంది."

"అయినా యీ ఒక్కబిళ్ళే రక్షించదు. ఈ విద్యకు సంబంధించిన సుళువులు ఏమైనా వుండి ఉంటాయి. బట్టలు కూడా మామూలివి అయివుండవు. అయినా మీ అమ్మగారిని అడిగి చూడకపోయావు?" గోపాలం దిగులుగా అన్నాడు.

"మా అమ్మకు తెలవదుగా? శలవల్లో ఫ్రెండ్ ఇంటికి హైదరాబాదు వెళుతున్నానని చెప్పాను. అమ్మకు తెలిస్తే చచ్చినా ఒప్పుకోదు" అన్నాడు నాగేశ్ టెంటులోంచి బయటికి చూస్తూ.

"మీ అమ్మకు తెలియకుండా నువ్వీ పని చేయటం మంచిదికాదు. ఇవ్వాల్టికిది మానేసేయ్. తరువాత ఆలోచించుకోవచ్చు." ఆదుర్దాగా అన్నాడు గోపాలం.

"అదెలా బాబుగారు?" అన్నాడు నాగేష్ సాలోచనగా.

"ఏముంది? ఎవరి డబ్బు వాళ్ళకిస్తే సరిపోయే? నీకు వంట్లో బాగా లేదని మీ కాంట్రాక్టర్ చేత చెప్పించవచ్చును" అన్నాడు గోపాలం.

"అలా చేస్తే ఇంత జనం ఆ యాదగిరిని ప్రాణాలతో వదుల్తారా? ఆంజనేయ స్వామివారు ఆ కుర్రాడి గుండెల మీద అంత దేదీప్యమానంగా వెలిగిపోతుంటే భయం దేనికి? ఆ స్వామి మహిమ నీలాంటి నాస్తికులకు అర్థం కాదు. పైగా ఆ కుర్రాడి చేతి రేఖలు ఎంత స్పష్టంగా ఉన్నాయి! ఎనభయ్ సంవత్సరాలు ఢోకా లేకుండా బ్రతకుతాడు. చాలా గొప్ప భవిష్యత్తు ఉంది." శాస్త్రి గబగబా అనేశాడు.

నాగేష్ కళ్ళలో కాంతిరేఖలు కదిలిపోతున్నాయి. శరీరంలోని ప్రతి అణువులో జీవితం నిండుగా ప్రవహిస్తుంది. గోపాలం ఆ కుర్రవాణ్ణే రెప్పవాల్చకుండా చూస్తూ

కూర్చున్నాడు. దూరంగా బావి దగ్గర ఉన్న జనంలో అల్లరి! నాగేష్ ఉలిక్కిపడి టెంటులోంచి బయటకు చూశాడు.

మైక్‌లోనుంచి కాంట్రాక్టర్ యాదగిరి కంఠం బిగ్గరగా వినిపిస్తూంది:

"త్వరపడండి! త్వరపడండి! ఐదు నిముషాలలో అతిలోక భయంకరమైన ఫీట్ జరుగబోతున్నది! ప్రవేశం ఒక్క పావలా మాత్రమే! ఇరవై అయిదు నయా పైసలు! త్వరపడండి! త్వరపడండి! వ్యవధిలేదు."

నాగేష్ లేచి నిల్చున్నాడు.

శాస్త్రికి వళ్ళు పులకరించింది.

గోపాలానికి ఒళ్ళు జలదరించింది.

"ప్రపంచంలో ఇంతవరకు కనీవినీ ఎరుగని వింత! ముక్కుపచ్చలారని పదహారేళ్ళ బాలుడు-మూడు వందల గజాల ఎత్తునుంచి అగ్నిగోళంగా మారి, సరాసరి మృత్యు గహ్వరంలోకి ఎలా దూకుతాడో కనులారా చూడండి! ఒక్క పావలా మాత్రమే! వెల్ ఆఫ్ డెత్! ఒక కప్పు కాఫీ ధరకే! వెల్ ఆఫ్ డెత్! రెండు రబ్బరు బెలూన్ల వెల! ఇరవై అయిదు నయాపైసలు మాత్రమే! త్వరపడండి! కొద్దిక్షణాల్లో షో బిగిన్ కాబోతోంది! వెల్ ఆఫ్ డెత్!" యాదగిరి కంఠం తారస్థాయిలో వినిపిస్తూంది.

"వెల్ ఆఫ్ డెత్!" గోపాలం చెవుల్లో గింగురుమంటోంది యాదగిరి కంఠం. మెదడులో సన్నగా పోటు ప్రారంభమయ్యింది. లేచి రెండడుగులు ముందుకు వేసి గబుక్కున నాగేష్ చెయ్యి పట్టుకున్నాడు.

శాస్త్రి గుండెలు గుబగుబలాడాయి.

"బాబుగారూ! భయపడకండి. టైం అయిపోయింది. మళ్ళీ అర్ధగంటలో వచ్చి మిమ్ములను కలుసుకుంటాను. నాకు కనిపించకుండా వెళ్ళిపోకండి! అంటూ నాగేష్ గోపాలానికి, శాస్త్రికి నమస్కారం చేసి బయటకు వెళ్ళిపోయాడు. నాగేష్ వెనకే గోపాలం టెంటు బయటకు వచ్చి నిలబడ్డాడు.

దూరంగా బావి దగ్గర నిచ్చెన ముందు నిలబడ్డ నాగేష్‌ను తదేకదృష్టితో చూస్తూన్న గోపాలాన్ని భుజం తట్టి "రావోయ్ గోపాలం! మనంకూడా వెళదాం" అన్నాడు శాస్త్రి.

"నేను ఇక్కడే ఉంటాను, మీరు వెళ్ళండి!" అన్నాడు గోపాలం నూతిలోనుంచి మాట్లాడుతున్నట్లు.

గోపాలం ముఖంలోకి ఓ నిముషం ఆశ్చర్యంగా చూసి శాస్త్రి గబగబా ముందుకు జనాన్ని తోసుకుంటూ వెళ్ళిపోయాడు.

మరో రెండు నిమిషాలకు నిచ్చెన మెట్లలా కట్టివున్న ఇనుప మెట్లను గబగబా ఎక్కిపోతున్నాడు నాగేష్. వేల కొద్దీ కళ్ళు ఆ కుర్రాడితోపాటు పైకి ఒక్కొక్క మెట్టే ఎక్కుతున్నాయి. అందరూ గాలి పీల్చుకోవటంకూడా మర్చిపోయినట్లు చూస్తున్నారు.

గోపాలం మెడ విరుచుకుని పైకి చూశాడు. చుక్కల్లో చందమామలా నాగేశ్ విశాలమైన ఆకాశంలో తెల్లని నల్లని మబ్బుల క్రింద ఇనప చట్రంలో నిలబడి ఉన్నాడు. పదహారేళ్ళ నాగేశ్ ఐదేళ్ళ కుర్రాడికంటే చిన్నగా కనిపిస్తున్నాడు.

బావి చుట్టూ జనం ఇసుకవేస్తే రాలకుండా ఉన్నారు. మోరలు పైకెత్తి కళ్ళార్ప కుండా చూస్తున్నారు. ఆరునెలలు గర్భిణీ స్త్రీ ఏణ్ణర్థం పిల్లాడిని చంకనేసుకొని గుండెలు

చిక్కబట్టి పైకి చూస్తోంది! నాగేష్ ఒక జేబులోనుంచి సీసా తీశాడు. "పెట్రోలు పెట్రోలు" అంటూ జనంలో కేకలు. సీసాను బిరడా తీసి ఒంటిమీద ఒలకబోసుకున్నాడు. సీసాను కింద బావిలోకి విసిరాడు. రెండో జేబులోనుంచి అగ్గిపెట్టె తీసి అందరికి చూపిస్తున్నాడు. అగ్గిపెట్టె కనిపించకపోయినా ఆ చేతిలో ఉండేదేమిటో అందరికీ అర్థం అయింది.

శాస్త్రికి చిరుచెమటలు పట్టి చంకలోని పంచాంగం, రొంటినున్న ఐదు రూపాయలనోటు చెమ్మగిల్లాయి. ఆ సమయంలో ఓ చిటికెడు పొడుం పట్టుబడితే బాగుంటుం దనిపించింది. కాని ఈ లోపలే ఆ దృశ్యం జరిగిపోతే?

"మృత్యువుతో నేరుగా పోరాటం! వెల్ ఆఫ్ డెత్!" తారస్థాయిలో వున్న యాదగిరి కంఠం ఆకస్మాత్తుగా ఆగిపోయింది. వెంటనే పెద్దగా గంట మోగింది.

ఒకటీ!

రెండూ! మూ...!

పేదవాడి ఆకలిలా అగ్నిదేవుడు భగ్గుమన్నాడు. నాలుకలు చాచిన అగ్నిజ్వాలలతో పాటు, అంతకంటే తీవ్రగతితో ఓ ఆర్తనాదం వినిపించింది! ఆ మండుతున్న ఆకారం క్షణకాలంలో గిర్రున సుడులు తిరుగుతూ వచ్చి కిందనున్న "వెల్ ఆఫ్ డెత్" బావిలో కాక ఒడ్డునే పైకి చూస్తూ నిలబడ్డవాళ్ళ నెత్తినే పడింది!

జనం కకావికలై పరుగెత్తసాగారు. కొందరికి బట్టలంటుకున్నాయి. పిల్లా జెల్లా, ఆడా మగా విచక్షణ లేకుండా విరగదొక్కుకుంటున్నారు. ఒకటే తొక్కిసలాట. క్రింద పడ్డవాళ్ళ పీకలమీదుగా నడిచి ప్రాణాలు రక్షించుకోవటమే ఆ బీభత్సంలో పరమధర్మంగా పాటించబడింది.

గోపాలం గుండెలు బ్రద్దలయినై. మస్తిష్కంలో అగ్నిగోళాలు వీచాయి. అంతలో అంధకారపు చుట్టలు సుడులు తిరిగాయి. నిరాకార రూపాలు అల్లీబిల్లీ తిరిగాయి. శాస్త్రి వచ్చి రెక్కపట్టుకొని లేపేదాకా గోపాలం ఈ ప్రపంచంలో లేడు. స్పృహవచ్చిన గోపాలం లేచి మట్టి దులుపుకొని శాస్త్రి భుజం ఆసరాగా బయటకు నడిచాడు.

కొద్ది నిమిషాల క్రితం, ఆనందంతో, ఉద్రేకంతో, ఉరవళ్ళు తొక్కుతూ, కేరింతలు కొట్టున్న ప్రదర్శన వాతావరణం బీభత్సంగా మారి, ఆర్తనాదాలతో శోకతప్తమయి పోయింది. అంతా నిర్వికారంగా చూస్తూ శాస్త్రీ గోపాలమూ ఆ ప్రదర్శనశాలనుంచి బయటపడ్డారు.

సిమెంటు రోడ్డుమీద నడుస్తొన్న గోపాలం, ఇసుకలో కూరుకుపోతున్నట్లు అడుగులో అడుగు వేస్తున్నాడు. పక్కనే శాస్త్రి పాదాలు భూమిని ధాటిగా తాకుతున్నాయి. ఇద్దరి మధ్యా మౌనం హిమాలయ పర్వతంలా నిలబడి ఉంది. గోపాలం మనస్సు అతి శీతలంలో ఉదకం ఘనీభవించే స్థితిలో ఉంది. శాస్త్రి మనస్సు వేడి తగిలిన మంచుగడ్డ కరిగే స్థితిలో ఉంది.

నడుస్తూ నడుస్తూ గోపాలం ఏదో వింటూ అప్రయత్నంగా హఠాత్తుగా ఆగి పోయాడు. శాస్త్రికూడా యాంత్రికంగా గోపాలాన్నే చూస్తూ నిల్చుండిపోయాడు.

దేవాలయంలోంచి గంటలు వినబడుతున్నాయి. అది ఆంజనేయస్వామివారి గుడి. శనివారం కావటంవల్ల గుళ్ళో హడావిడిగా ఉంది. గర్భగుడిలోంచి ఆంజనేయస్వామివారి దండకం స్పష్టంగా వినిపిస్తోంది. గోపాలానికి ఏమీ కనిపించటం లేదు. అంతా చీకటి.

లోపల చీకటి. బయట చీకటి. చేతులు జోడించి తలవంచి మంత్రముగ్ధుడిలా గోపాలం దేవాలయ ప్రాంగణంలోకి ప్రవేశించాడు.

అలా గుడిలోకి పోతున్న గోపాలాన్ని విస్తుపోయి చూశాడు శాస్త్రి. అడుగు ముందుకు వెయ్యబోయి విద్యుత్ ఆగిపోయిన యంత్రంలా కదలకుండా అలానే నిలబడిపోయాడు.

శాస్త్రికి మళ్ళీ కాళ్ళకింద చల్లగా తగిలి "కీచ్" మన్నట్టనిపించింది. అది పసిబిడ్డ పాల గొంతుకో, లేక చూలాలి నిండుగర్భమో! శాస్త్రి తల విదిలించుకున్నాడు. చంకలోని పంచాంగం చేతిలోకి తీసుకొని చూశాడు. కళ్ళు జ్యోతుల్లా మండుతున్నాయి. చేతిలో ఉన్న పంచాంగాన్ని ఆంజనేయస్వామివారి గుడి గోడపక్కగా పొర్లాడుతున్న కుక్క మీదకు విసిరేశాడు.

రొంటినవున్న ఐదు రూపాయల నోటు తీసి గుడిముందు కూర్చున్న కళ్ళులేని కబోది చేతుల్లోకి విసిరాడు. రెండు చిటికెలు నశ్యం పట్టించాడు. ఏదో జ్ఞానబోధ అయిన వాడిలా రెండుసార్లు తల పంకించి, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ, ముందుకు, ఆంజనేయస్వామివారి గుడి దాటి గబగబా వెళ్ళిపోయాడు.

(1967 - జయశ్రీ మాసపత్రిక)